తలుపులు తియ్యటం లేదు. చూస్తున్న శ్రీరాంకి ఈ పద్ధతి రుచించలేదు. గబుక్కున తలుపు దగ్గరకెళ్లి అక్కడి వాళ్లు వారిస్తున్నా వినకుండా తలుపు తీశాడు.

★ ★ ★

అలా తలుపు తీశాడో లేదో ఒక బొగ్గుల బస్తా దభీమని లోపల పడింది. జనం ఉలిక్కి పడి పక్కకు తప్పుకున్నారు. ఆ బస్తాను లోనికి నెట్టుకుంటూ పాతికేళ్ల యువతి లోపలికొచ్చింది. ఎర్రగా అందంగా వుంది. చెవులకి లోలాకులు తళతళ మెరుస్తున్నాయి.

"అంత సేపట్నుంచీ తలుపులు బాత్తుంటే తియ్యరేటి బావూ; ఈ బండి పోతే మళ్లీ బండి లేదు. మావేం గావాల?" అడిగింది అందర్నీ ఉద్దేశిస్తూనూ, ఎవర్నీ ఉద్దేశించకుండానూ. ఆమె ఆకారానికీ, భాషకీ ఎక్కడా పోలిక లేదు.

ఎవరూ మాట్లాడలేదు. కింద ఇంకెవరో ఉన్నారు. చూస్తుండగానే అలా బస్తామీద బస్తా పదిహేను బొగ్గుల బస్తాలు లోపలికొచ్చి పడ్డాయి. ఆ తర్వాత సుమారు ముప్ఫయ్యేళ్ల లోపు మరో స్త్రీ లోపలికొచ్చింది. ఇద్దరికీ పోలికలున్నాయి. అప్పా చెల్లెళ్ళు కాబోలనుకున్నాడు కళాధర్.

అప్పా చెల్లెళ్లిద్దరూ చేతులు దులుపుకుని మట్ట గోచీలు పెట్టారు. దారికడ్డంగా ఉన్న బొగ్గుల బస్తాల్ని రెండు కంపార్టుమెంటుల మధ్య సందులోకి లాగడం ప్రారంభించారు. వాళ్లిద్దర్లో పెద్దామె చాలా బలంగా వుంది. బిగింపు గలవొళ్ళు. అక్క కన్నా చెల్లెలు పొడుగ్గా ఉన్నా బలంగా లేదు. అంతలేసి బరువున్న బస్తాల్ని వాళ్ళు అవలీలగా లాక్కెళుతుంటే కళాధర్‌కి ఆశ్చర్యం వేసింది. కంపార్ట్‌మెంటంతా కిటకిటలాడు తోంది. కంపార్ట్‌మెంట్ నడవాలో అటూ ఇటూ ఇద్దరూ స్టూడెంట్ కుర్రాళ్లు నిలబడి వున్నారు. వదులు చొక్కాలు, జీన్ పాంట్లు, మెళ్ళో గొలుసులు. ఒకతనికి నెత్తిమీద టోపీ వుంది. ఆ ఆడవాళ్లు బస్తాలు లాక్కెళుతుంటే కావాలనే వెనక్కి తప్పుకోకుండా వాళ్లని రాసుకుంటూ స్పర్శానందం పొందుతున్నారు. వాళ్లదేమీ పట్టించుకోలేదు. నడవా పొడుగునా బొగ్గుమసి రాలుతోంది. కూర్చున్నవాళ్లు విసుక్కుంటున్నారు. కళాధర్‌కీ, శ్రీరాంకీ బొగ్గుమసి అంటకుండా పోలేదు. వాళ్లు అటూ ఇటూ నడుస్తున్నప్పుడల్లా కళాధర్ ఇబ్బంది పడుతూనే వున్నాడు. రైలుతన దారిని తను పోతోంది నెమ్మదిగా మెలికలు తిరుగుతూ.

ఇంకా రెండు బస్తాలు మిగిలిపోయాయి. సర్దటానికి తావు మిగల్లేదు. పెద్దామె స్టూడెంట్స్ కూర్చున్న దగ్గరికి వచ్చింది. "ఒరే, దర్మాపూరి దానమ్మ మన డబ్బాలోకే వచ్చిందిరోయ్!" అన్నాడో స్టూడెంట్. తక్కిన వాళ్లంతా గొల్లున నవ్వారు.

"బావూ! కాత్త తప్పుకుంటారా? ఈ రొండూ అక్కడెట్టేత్తాను" అని ప్రాధేయపడింది ఆమె.

"ఏ రెండూ?" కొంటెగా అడిగాడో కుర్రాడు.

ఆమె ఏ మాత్రం సిగ్గుపడలేదు. కించపడనూ లేదు.

"ఇయ్యాల డూటీకి ఈడొచ్చేత్తాడని నాను మాత్రం కలగన్నానేటి? సూడండి బాపూ! పోయిన సారి అడిగినంతియ్యలేదని ఆడి కోపం. ఆడు అడిగి నంతిత్తే మాకు మిగినేదేటి?" అంటూ మొత్తుకుంటుంది పైడమ్మ.

లగేజీ లేకుండా దొంగ వ్యాపారాలు మామూలేననీ, టి.టి.ఇ. దగ్గర్నుంచి డ్రైవర్ దాకా అందరికీ ఇందులో మామూళ్లుంటాయనీ, వాల్తేరు స్టేషన్ రాక ముందే లగేజి దించుకోడానికి డ్రైవర్ రైలు అపుతాడనీ జనం మాట్లాడుకుంటున్నారు. కళాధర్ కెందుకో పైడమ్మంటే సానుభూతి కలిగింది. శ్రీరాం మధన పడుతూ జరిగేది చూస్తున్నాడు. అతనికేం చేయడానికీ పాలు పోలేదు. ఎవరిది అవినీతో అర్థం కాలేదు.

ఇంతలో ఒక పోర్టర్ వచ్చి ప్లాట్ ఫారం మీద బస్తాల్ని లెక్క పెట్టి 'అయ్యగారు రమ్మంతన్నాడు" అని పైడమ్మతో చెప్పాడు. అయ్యగారంటే పోలీసని పైడమ్మకి తెలుసు.

"ఒలప్పా! అంటూ జగ్గమ్మ ఏడుపు లంకించుకుంది.

"ఏం పర్నేదే! ఏడవమాక. నువ్వట్టా సూత్తుండు. నిమిట్లో వచ్చేత్తా" అంటూ పైడమ్మ వెళ్ళింది. ఏం జరుగుతుందో చూద్దామని కొంతమంది వెళ్ళారు! శ్రీరాం కూడా వాళ్ళ వెంట వెళ్లాడు. రైలు కదిలే సూచన లేదు.

కళాధర్ అక్కడే నిలబడి పోయాడు. జగ్గమ్మ మెల్లగా ఏడుస్తోంది. మసక వెలుతుర్లో ఆమె చెంపల మీద కన్నీరు మెరుస్తోంది. మాటిమాటికీ ముక్కు చీదుకుంటోంది. కళాధర్ కి ఆమెని వోదార్చుదామనిపించింది గానీ ఏమని ఒదార్చాలో తెలియక అలాగే ఉండి పోయాడు.

కాసేపట్లో శ్రీరాం తిరిగి వచ్చాడు. జనంతోపాటు పైడమ్మ కూడా వచ్చింది. చెల్లెల్ని పక్కకి పిలిచి చెప్పింది.

"మరేం నేదు. నువ్వేం బయపడమాక. అంతా సెటిలైపోయిందిలే. ఈడు ముదనట్టపోడుగానీ ఆ బాబు మంచోడు. నానీడే వుండిపోతాను. నువ్వు బేగెల్లిరా టేషన్ ముందు బండి ఆగుతాది. అయన్నీ కిందికి నాగెయ్యి. సీటు కిందయి మర్చిపోమాక"

జనం రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. "ఎంత బరితెగించిందో చూర్రా! ఇప్పటిదాకా నా పక్కన పత్తిత్తులాగా కూర్చుంది" అంటున్నాడు చీకట్లో పైడమ్మని ముద్దు పెట్టుకున్న కుర్రాడు.

"ఏమైంది సంగతి?"

అడిగాడు కళాదర్ శ్రీరాంని.

"ఏముందీ? పోలీసాయన రూంలోకి తీసుకెళ్లి ఆమెని నానా తిట్లు తిట్టాడు. కేసు పెడతానన్నాడు. పైడమ్మ మెల్లగా దగ్గరకు చేరి 'రాత్రికి రమ్మంటారా?' అని అడిగింది. మాకూ వినబడిందిలే. అంతే! అంత మనిషీ డంగైపోయాడు. కేసు దెబ్బకి తేలిపోయింది." అన్నాడు శ్రీరాం. ఎందుకో అతని మొహం జేవురించింది.

